క్లుప్తంగా

పునరావాస కేంద్రాలకు తరలించాలి



అప్పనపల్లి కాజ్‌వే వద్ద వరద పరిస్థితిని పరిశీలిస్తున్న ఆర్డీఓ కేశవవర్ధన్‌రెడ్డి

మామిడికుదురు: గోదావరి వరద బాధితులను పునరావాస కేంద్రాలకు తరలించేందుకు చర్యలు తీసుకోవాలని అమలాపురం ఆర్డీఓ, మండల ప్రత్యేకాధికారి కేశవవర్ధన్‌రెడ్డి ఆదేశించారు. ఆయన మంగళవారం గోదావరి వరద పరిస్థితిని సమీక్షించారు. ముంపుబారిన పడిన అప్పనపల్లి కాజ్‌వేను పరిశీలించారు. కాజ్‌వేపై నుంచి వెళ్లేందుకు ఎవరినీ అనుమతించవద్దన్నారు. గర్భిణులు, బెడ్ రిడెన్ పేషెంట్లను సురక్షిత ప్రాంతాలకు తరలించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. పారిశుధ్యంపై ప్రధానంగా దృష్టి సారించాలని సూచించారు. వరద బాధితులకు అవసరమైన తాగునీరు అందించేందుకు చర్యలు తీసుకున్నామన్నారు. ఏ విధమైన అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు చేపట్టామని చెప్పారు. ఆయన వెంట తహసీల్దార్ ఎం.మేరికమ్మ, నగరం ఎస్సై పి.సురేష్, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

లొల్ల, ర్యాలి లాకుల ఆధునీకరణకు చర్యలు తీసుకోవాలి



ఎమ్మెల్యే బండారు సత్యానందరావు

కొత్తపేట: సెంట్రల్ డెల్టాలో లొల్ల, ర్యాలి లాకుల ఆధునీకరణకు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే బండారు సత్యానందరావు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. అసెంబ్లీ సమావేశాలు జరుగుతున్న నేపథ్యంలో ఎమ్మెల్యే బండారు నియోజకవర్గ సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకువెళ్లారు. దానిలో భాగంగా సెంట్రల్ డెల్టాకు సంబంధించి కొత్తపేట నియోజకవర్గంలో లొల్ల, ర్యాలి లాకులు పూర్తిగా శిథిలావస్థకు చేరాయని, సుమారు 137 ఏళ్ల క్రితం అప్పటి బ్రిటిష్ ప్రభుత్వం నిర్మించిన లాకుల ద్వారా సెంట్రల్ డెల్టాలో 5 నియోజకవర్గాల రైతుల సాగు భూములకు ఈ లాకుల ద్వారానే సాగునీరు అందుతుందన్నారు. ఈ లాకులపై నుంచే రాష్ట్ర రహదారి వెళ్లిందన్నారు. ఈ లాకుల పునర్నిర్మాణానికి సుమారు రూ.60 కోట్ల వ్యయం అవుతుందని ప్రస్తావించారు. జలవనరుల శాఖ మంత్రి స్పందించి నిధులు మంజూరు చేయాలని కోరారు.

వెటర్నరీ ఆఫీసర్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడిగా 'యల్లమెల్లి'



రుక్మాంగధరావు

పి.గన్నవరం: ఏపీ నాన్ గ్రాడ్యుయేట్ వెటర్నరీ ఆఫీసర్స్ అసోసియేషన్ ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా ఉపాధ్యక్షుడిగా మండలంలోని ఆర్.ఏనుగుపల్లి గ్రామానికి చెందిన యల్లమెల్లి రుక్మాంగధరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆయన కొత్తపేట మండలం పలివెల ప్రభుత్వ పశు వైద్యశాలలో జూనియర్ వెటర్నరీ ఆఫీసర్‌గా పనిచేస్తున్నారు. కాకినాడలో జరిగిన అసోసియేషన్ సమావేశంలో ఆయనను రెండోసారి ఉపాధ్యక్షుడిగా ఎన్నుకున్నారు. తన ఎన్నికకకు సహకరించిన అసోసియేషన్ నాయకులకు, సభ్యులకు రుక్మాంగధరావు కృతజ్ఞతలు తెలిపారు. సహ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు.

బైక్ ఢీకొని ఇరువురికి తీవ్రగాయాలు



చినలంకలో జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన సూర్యనారాయణ, రామకృష్ణ

అంబాజీపేట: పుల్లేటికుర్రు శివారు చినలంక ప్రధాన రహదారిలో మంగళవారం గుర్తుతెలియని బైక్ ఢీకొని ఇరువురి వ్యక్తులకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మాచవరానికి చెందిన పితాని సూర్యనారాయణ, అతని సోదరుడు పితాని రామకృష్ణ బైక్‌పై కొత్తపేట నుంచి అంబాజీపేట వైపు వస్తున్నారు. చినలంక వచ్చే సరికి ఎదురుగా గుర్తుతెలియని బైక్ వారిని ఎదురుగా ఢీ కొట్టిందన్నారు. దాంతో సూర్యనారాయణ, రామకృష్ణలకు తీవ్ర గాయాలు కాగా 108లో అమలాపురం ఆస్పత్రికి తరలించారు.

దస్తావేజు లేఖరి మృతికి సంతాపం

అంబాజీపేట: పి.గన్నవరం మండలం నరేంద్రపురానికి చెందిన లేఖరి కాజులూరి సత్యనారాయణ సోమవారం రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందడంతో అంబాజీపేట దస్తావేజుల సంఘం ఆధ్వర్యంలో సంతాపం వ్యకం చేశారు. సత్యనారాయణ అకాల మృతి పట్ల స్థానిక సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద మంగళవారం సంతాపం వ్యక్తం చేశారు. సత్యనారాయణ ఆత్మకు శాంతి చేకూరాలని రెండు నిమిషాల మౌనం పాటించారు. అనంతరం పెన్‌డౌన్ నిర్వహించారు. అలాగే రిజిస్ట్రార్ కార్యాలయ సిబ్బంది సంతాపం వ్యక్తం చేశారు.



బూరుగులంకలో పడవపై పాల క్యాన్లు తీసుకువస్తున్న రైతులు



ముక్తేశ్వరం-అయినవిల్లిలంక ఎదురుబిడెం కాజ్‌వే మునగడంతో పడవలపై ప్రజలను దాటిస్తున్న అధికారులు



అప్పనపల్లి కాజ్‌వేపై నుంచి నడిచి వస్తున్న బాధితులు



అప్పనపల్లిలో ఎండుగడ్డిని భవనంపై భద్రపర్చుకుంటున్న రైతులు



అప్పనపల్లిలో కొబ్బరి తోటలను ముంచెత్తిన గోదావరి వరద

జలదిగ్బంధం

- నీటమునిగిన అప్పనపల్లి, ఎదురుబిడెం, సఖినేటిపల్లి, కనకాయలంక కాజ్‌వేలు
- ప్రజలకు తప్పని అవస్థలు
- పశుగ్రాసం కాపాడుకునే యత్నంలో రైతులు



మొండెపులంక శివారు పుచ్చల్లంకలో వరదనీట మునిగిన బెండతోట

మామిడికుదురు: గోదావరి వరద ఉధృతితో లంక గ్రామాలు జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. ప్రధాన రహదారులను వరద నీరు ముంచెత్తడంతో తీర గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పాశర్లపూడి కరకట్ట దిగువన ఉన్న అప్పనపల్లి కాజ్‌వేపై భారీగా వరద నీరు ప్రవహిస్తోంది. ఇక్కడ నాలుగడుగుల మేర వరద నీరు పొంగి ప్రవహిస్తోంది. దీంతో ఈ మార్గంలో రాకపోకలను నిలిపి వేశారు. దీంతో అప్పనపల్లి, బి.దొడ్డవరం, పెదపట్నంలంక గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అప్పనపల్లి పెట్రోల్ బంకు సమీపంలో ప్రధాన రహదారి సైతం ముంపుబారిన పడింది. బి.దొడ్డవరం ఆర్అండ్‌బీ రోడ్డు కూడా జలదిగ్బంధంలో చిక్కుకుంది. మామిడికుదురు శివారు కొర్లగుంట ఏటిగట్టు దిగువ నుంచి అప్పనపల్లి వెళ్లే రోడ్డు ముంపులో చిక్కుకుంది. దీంతో పాటు పెదపట్నం, పాశర్లపూడి, పాశర్లపూడి లంక గ్రామాల్లోని మత్స్యకార కాలనీలను వరద నీరు చుట్టుముట్టింది. పెదపట్నం మధ్య లంక పూర్తిగా ముంపు బారిన పడడంతో పశుగ్రాసంతో రైతులు ఇంజిన్ నావలపై సురక్షిత ప్రాంతాలకు తరలించారు. ముంపు భయంతో అప్పనపల్లి, బి.దొడ్డవరం గ్రామాల నుంచి సైతం పశువులను ఏటిగట్టు ఎగువ ప్రాంతాలకు తరలించారు. పై మూడు గ్రామాల్లో కొబ్బరికాయలు దింపు తీసి రెండెడ్ల బళ్లపై సురక్షిత ప్రాంతాలకు తరలించుకోవడంలో రైతులు ఇబ్బందులు పడ్డారు. ఎండుగడ్డి ముంపు బారిన పడకుండా భవనాలపై దాచుకున్నారు. గోదావరి వరద మరింత తీవ్రంగా ఉన్న నేపథ్యంలో లంక గ్రామాల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

లోతట్టు ప్రాంతాలను చుట్టుముట్టిన వరద

సఖినేటిపల్లి: ధవళేశ్వరం వద్ద రెండో వరద ప్రమాద హెచ్చరిక నేపథ్యంలో మంగళవారం మండలంలో అప్పనరామునిలంక, టేకిశెట్టిపాలెం గ్రామాల పరిధిల్లోని లోతట్టు ప్రాంతాలను, ప్రధాన రహదారులను, నివాస గృహాలను, కొబ్బరి తోటలను వరద నీరు చుట్టుముట్టింది. దీంతో పై రెండు గ్రామాల మధ్య గోదావరిపాయపై ఇటీవల నిర్మించిన కాజ్ వే ద్వారా రాకపోకలు నిలిచిపోయాయి. అలాగే గోదావరి పాయను ఆనుకుని టేకిశెట్టిపాలెం వైపు ఉన్న అగ్నికుల క్షత్రియ కాలనీకి వరద నీరు పోటెత్తింది. టేకిశెట్టిపాలెం ఆంజనేయస్వామివారి ఆలయం వైపునకు కూడా వరద నీరు పోటెత్తింది. సఖినేటిపల్లి లాకుపేటలోకి వరద నీరు చేరింది. సఖినేటిపల్లి వద్ద గోదావరి పాయపై నిర్మించిన కాజ్ వే వరద నీటిలో ఉంది. కాజ్ వేపై మోకాలి లోతులో వరద ప్రవహిస్తోంది. సమీపంలోని వారు పడవలపై కాజ్ వే వద్దకు చేరుకుని, ఇతర ప్రాంతాలకు రాకపోకలు సాగిస్తున్నారు. కాగా వరద తీవ్రతను బట్టి టేకిశెట్టిపాలెం ఏటిగట్టు వద్ద నుంచి అప్పనరామునిలంకలోని వివిధ గ్రూపులకు బుధవారం నుంచి పడవలు ఏర్పాటు చేస్తామని అధికారులు తెలిపారు.

మునిగిన అరటి, కూరగాయ పంటలు

వరద ఉధృతికి వరదనీరు లోతట్టు ప్రాంతాల్లోకి అరటి, కొబ్బరి, కోకో, మినుము, పెసర, కూరగాయపంటలు మునిగాయి. వరదతో తమ పంటలను పూర్తి దెబ్బతింటాయని రైతులు చెబుతున్నారు. అలాగే పశుగ్రాసం దెబ్బతింటుదని రైతులు వాపోతున్నారు. తమను ప్రభుత్వం ఆదుకోవాలని వారు కోరుతున్నారు.

వరద ఉధృతితో లంక వాసులకు ఇబ్బందులు

పి.గన్నవరం: వశిష్ట, వైనతేయ నదీపాయలు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో లంక గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మండలంలోని లంక గ్రామాలను వరదనీరు చుట్టుముట్టింది. కె.ఏనుగుపల్లి, మానేపల్లి శివారు శివాయలంకలకు వెళ్లే రహదారులపై మంగళవారం వరద ప్రవహిస్తోంది. మూడడుగుల ఎత్తున ప్రవహిస్తున్న శివాయలంకకు వెళ్లేందుకు అధికారులు ట్రాక్టర్ ఏర్పాటు చేశారు. దానిపై ప్రజలు రాకపోకలు సాగిస్తున్నారు. ఊడిమూడిలంక, జి.పెదపూడిలంక, బూరుగులంక, అరిగెలవారిలంక గ్రామాల ప్రజలు వరద ఉధృతిలో ఇంజిన్ పడవలపై రాకపోకలు సాగిస్తున్న విషయం విదితమే. బూరుగులంకకు వెళ్లే దారిలో ఏటిగట్టు దిగువన పాయలోకి నీరు చేరడంతో అక్కడ సిమెంటు రోడ్డు మునిగిపోయింది. దీంతో వంతెన నిర్మాణం కోసం నిర్మించిన అప్రోచ్ రోడ్డు మీదుగా ప్రజలు బూరుగులంక రేవుకు వెళ్లి అక్కడ పడవలు దాటుతున్నారు. అలాగే సరిహద్దు జిల్లాకు చెందిన పెదమల్లంక, ఆనగర్లంక, సిర్రావారిలంక, చాకలిపాలెం శివారు కనకాయలంక గ్రామాల ప్రజలు ఇంజిన్ పడవలపై ప్రయాణిస్తున్నారు. కె.ముంజవరం అవుట్‌ఫాల్ స్లూయిస్ వద్ద వైనతేయ పాయ నుంచి వరదనీరు డ్రెయిన్‌లోకి వెనక్కి వస్తుండటంతో అక్కడ ఇసుక బస్తాలతో పటిష్టత చర్యలు చేపట్టారు. భద్రాచలం వద్ద వరద స్వల్పంగా తగ్గుముఖం పట్టినా ఇక్కడ వరద ఉధృతి పెరుగుతుండటంతో ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వరద ముంపు ప్రాంతాల్లో కొత్తపేట ఆర్డీఓ జీవీవీ సత్యనారాయణ పర్యటించారు. తహసీల్దార్ షేక్ హుస్సేన్, ఎంపీడీఓ త్రిశూలపాణి, వివిధ శాఖల అధికారులు పరిస్థితిని పర్యవేక్షిస్తున్నారు.

ఉధృతంగా వరద

ఆలమూరు: మండలంలోని లంక గ్రామాల వెంబడి ప్రవహిస్తున్న గౌతమీ గోదావరి రోజురోజుకూ ఉధృతమవుతుంది. ధవళేశ్వరం బ్యారేజీ వద్ద ప్రస్తుత నీటిమట్టం 13 అడుగులు దాటితే మండలంలోని బడుగువానిలంక, చొప్పెల్ల, జొన్నాడ తదితర గ్రామాల లంక పొలాలు మునిగిపోవడంతో పాటు గ్రామం నలుమూలల ఉన్న పాయల్లో నీరు చేరే అవకాశం ఉందని ఆయా లంక గ్రామాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు. రైతులు ఇప్పటికే తమ వ్యవసాయ పరికరాలను, పశుగ్రాసాన్ని జాగ్రత్త పర్చుకున్నారు. తహసీల్దార్ డీవీఎస్ అనిల్‌కుమార్, ఎంపీడీఓ ఎ.మేరీరోజ్, ఎస్సై ఎల్.శ్రీను నాయక్, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ పి.పద్మ పర్యవేక్షణలో రెవెన్యూ, పంచాయతీరాజ్, ఇరిగేషన్, ఉద్యాన, పోలీసు శాఖాధికారులు వరద ప్రభావిత ప్రాంతాలను పరిశీలించి స్థానికులకు సూచనలు, సలహాలు అందజేశారు.



సఖినేటిపల్లి వద్ద గోదావరి పాయ కాజ్‌వేపై వరద ఉధృతి



అప్పనరామునిలంకలో వరద నీటిలో మెయిన్ రోడ్డు



ఆలమూరులోని గౌతమీ వంతెన ఏటిగట్టు వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న గోదావరి

నాటు పడవలపై ప్రజల దాటింపు

అయినవిల్లి: మండలంలోని ముక్తేశ్వరం-అయినవిల్లిలంక మధ్య ఎదురుబిడెం వద్ద కాజ్‌వేపై మనిషిలోతు వరద నీరు చేరడంతో వీరవల్లిపాలెం, అయినవిల్లిలంక, కపిలేశ్వరపురం మండలంలోని అద్దంకివారిలంక గ్రామాలకు రాకపోకలు స్తంభించాయి. ఈ గ్రామాలకు నిత్యావసరాలు, పాలు, వ్యవసాయ ఉత్పత్తులు తరలించేందుకు రెవెన్యూ అధికారులు పడవలు ఏర్పాటు చేశారు. ముక్తేశ్వరం-అయినవిల్లిలంక ఎదురుబిడెం కాజ్‌వే వద్ద నాలుగు పడవలు, పొట్టిలంకలో రెండు, కొండుకుదురులంకలోని అర్లఅక్కమ్మ చెట్టు వద్ద ఒకటి, శానపల్లిలంకలో ఒకటి, వీరవల్లిపాలెంలో ఒకటి మొత్తం తొమ్మిది పడవలు ఏర్పాటు చేశారు. ముక్తేశ్వరం వృద్ధగౌతమీ నదిపాయలో వరద ఉధృతిగా ప్రవహిస్తుంది. ఇటుకబట్టీలు మునిగాయి. వృద్ధగౌతమి చెంతనున్న శ్మశాన వాటిక పూర్తిగా మునగడంతో వృద్ధగౌతమి కొత్తవంతెన రహదారి పక్కనే అంతిమ సంస్కారాలు నిర్వహించారు.

నీటమునిగిన పొలాల పరిశీలన



వక్కలంకలో జిల్లా వ్యవసాయాధికారికి సమస్యలు వివరిస్తున్న రైతులు

అంబాజీపేట: ఇటీవల కురిసిన భారీ వర్షాలకు వరి చేలు చెరువులను తలపించేలా ఉన్నాయని ఆ నీటిని బయటకు తరలించే మార్గం లేదని అధికారుల వద్ద వక్కలంక రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. అయినవిల్లి-పసుపల్లి సరిహద్దు వద్ద ఉన్న వక్కలంక పంట భూముల్లోకి వర్షపు నీరు భారీగా చేరడంతో జిల్లా వ్యవసాయాధికారి వి.బోసుబాబు, పి.గన్నవరం ఏడీఏ ఎస్‌జేవీ రామమోహనరావు, తహసీల్దార్ జె.విమలకుమారి, ఎంపీడీఓ జి.సరోవర్, ఏఓ సీహెచ్‌డీ విజయ్‌కుమార్‌లు మంగళవారం పరిశీలించారు. రైతులు మాట్లాడుతూ సుమారు వక్కలంకలో 50 ఎకరాలు వరి నాట్లు, 30 ఎకరాల్లో వరి నారుమడులు వేశామని వర్షానికి నీట మునిగిపోయాయన్నారు. అయినవిల్లిలోని జోగివారిపేట వద్ద చెరువులు తవ్వడంతో పంట బోదెలు మూసుకుపోయయన్నారు. మురుగునీరు వెళ్లే డ్రైనేజీ, పంట బోదెలను శుభ్రం చేయించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని పసుపల్లి, వక్కలంకకు చెందిన రైతులు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అధికారులకు అందజేశారు. దీనిపై అధికారులు స్పందించి మాట్లాడుతూ ఉపాధి హామీ పథకంలో పూడుకుపోయిన పంట బోదెలను శుభ్రం చేసి వరి చేలల్లో ఉన్న మురుగునీటిని తరలించేందుకు కృషి చేస్తామని రైతులకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఉపాధి ఏపీఓ బి.చంద్రమోహన్, పుల్లేటికుర్రు సెక్టార్ ఇరిగేషన్ ఏఈ బి.జయలక్ష్మి, ఏఈఓ డి.దుర్గారావు, రైతులు కె.రాంబాబు, సీహెచ్ సత్యనారాయణ, ఎ.వెంకన్న, జి.త్రిమూర్తులు తదితరులు పాల్గొన్నారు.

సురక్షిత ప్రాంతాలకు గర్భిణుల తరలింపు



అయినవిల్లిలంక వైద్య శిబిరాన్ని సందర్శించిన డీఎంఅండ్‌హెచ్‌ఓ దుర్గారావుదొర

అయినవిల్లి: వరద ఉధృతికి లంక గ్రామాల్లో నీరు చేరడంతో అక్కడే నివాసం ఉంటున్న 27 మంది గర్భిణులను సురక్షిత ప్రాంతాలకు తరలించినట్లు డీఎంఅండ్‌హెచ్‌ఓ ఎం.దుర్గారావు దొర తెలిపారు. మంగళవారం ఆయన ముక్తేశ్వరం-అయినవిల్లిలంక వద్ద ఏర్పాటు చేసిన ప్రభుత్వ వైద్య శిబిరాన్ని సందర్శించారు. ఆయన మాట్లాడతూ వరద ప్రభావంతో జిల్లాలోని 11 పీహెచ్‌సీల పరిధిలోని లంక గ్రామాలకు వరద ముంపు ఉందన్నారు. తాను మంగళవారం అయినవిల్లిలంక, లంకాఫ్ ఠాణేలంక, కూనాల్లంక, గురజాపులంక గ్రామాల్లో పర్యటించానన్నారు. వివిధ పీహెచ్‌సీల పరిధిలో 27 మంది గర్భిణులను గుర్తించి ముందస్తుగా సురక్షిత ప్రాంతాలకు తరలించామన్నారు. ఈ గ్రామాల్లోని ప్రజలను, వైద్యసిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఆదేశించామన్నారు. ఈ గ్రామాల్లో 62 వైద్య శిబిరాలను ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. 372 మంది వైద్య శిబిరాల వద్ద వరద గ్రామాల్లోని ప్రజలకు సేవలందిస్తున్నారన్నారు. తాగునీరు కలుషితమైనందున కాచిచల్లార్చిన నీటిని తాగాలని సూచించారు. ఆయన వెంట అయినవిల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి బి.మంగాదేవి ఉన్నారు.

మధ్య లంకలో చిక్కుకున్న ఆవుల తరలింపు



బోటు ద్వారా పశువులను ఒడ్డుకు తీసుకువస్తున్న దృశ్యం

మామిడికుదురు: పెదపట్నంలోని గోదావరి మధ్య లంకలో చిక్కుకున్న ఆవులను మంగళవారం రాత్రి సురక్షితంగా ఒడ్డుకు తీసుకువచ్చారు. వరద నీరు ముంచెత్తడంతో పశువులు మధ్య లంకలో చిక్కుకున్నాయి. ఉదయం నుంచి వాటిని బయటకు తీసుకువచ్చేందుకు ప్రయతి ్నంచినప్పటికీ ఇంజిన్ బోట్లు మొరాయించడంతో సాధ్యం కాలేదు. దీంతో ఎట్టకేలకు రాత్రి రెండు బోట్లు వేసుకెళ్లి ఆరు ఆవులను ఒడ్డుకు చేర్చారు. ఈ కార్యక్రమాన్ని తహసీల్దార్ మేరికమ్మ, నగరం ఎస్సై సురేష్ పర్యవేక్షించారు. కాగా మరికొన్ని పశువులు ఇంకా మధ్య లంకలో ఉండిపోయాయని రైతులు వాపోయారు.

అధికారులు స్పందించారు



జి.అగ్రహారం పేర్మాయిపాలెం రహదారి పక్కన పొక్లెయిన్ సాయంతో చెత్త తొలగిస్తున్న పంచాయతీ అధికారులు

సాక్షి ఇంపాక్ట్

అంబాజీపేట: గంగలకుర్రు అగ్రహారం శివారు పేర్మాయిపాలెం బండారులంక సరిహద్దులో ప్రధాన రహదారి పక్కన పేరుకుపోయిన చెత్తా, చెదారాన్ని మంగళవారం తొలగించారు. ఈ నెల 15న 'సాక్షి' దినపత్రికలో స్థలం ఒక పంచాయతీది.. చెత్త వేరే ఊరిది అనే వార్త కథనం వెలువడింది. దీనిపై ఎంపీడీఓ జి.సరోవర్ స్పందించి స్థానిక పంచాయతీ అధికారులతో సమస్యను సత్వరమే పరిష్కరించాలని సూచించారన్నారు. బండారులంక వాసులు చెత్త వేయకుండా ఆ గ్రామ పంచాయతీ అధికారికి లిఖిత పూర్వకంగా తెలియజేస్తామన్నారు. డంపింగ్ యార్డుగా మార్చిన స్థలంలో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసి చర్యలు తీసుకుంటామన్నారు. సర్పంచ్ దొంగ నాగేశ్వరరావు పర్యవేక్షణలో కార్యదర్శి ఆర్.ఏడుకొండల చంటి ప్రొక్లెయిన్ సాయంతో చెత్త తొలగించారు. ఇకపై ఎవరైనా ఈ ప్రాంతంలో చెత్త వేసినట్టు గుర్తిస్తే వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

ముంపు ప్రాంతాల్లో డీఆర్‌డీఏ పీడీ పర్యటన

అయినవిల్లి: ముంపు ప్రాంతాల్లో డీఆర్‌డీఏ పీడీ, వరదల మండల ప్రత్యేక అధికారి వి.శివశంకరప్రసాద్ మంగళవారం పర్యటించారు. అయినవిల్లిలంక, వీరవల్లిపాలెం, పొట్టిలంక, కొండుకుదురులంక గ్రామాల్లో ఆయన పర్యటించి గ్రామాల్లోని ముంపునకు గురైన లోతట్టు ప్రాంతాలను పరిశీలించారు. ఈ గ్రామాల్లో ప్రజలకు అందుతున్న వైద్య సేవలను పరిశీలించారు. తాగునీటి సరఫరాపై ఆరా తీశారు. ఆయన ఎంపీడీఓ సూర్యనారాయణమూర్తి, తహసీల్దార్ ప్రమద్వర, వివిధ శాఖ అధికారులు ఉన్నారు.

నారుమడుల పరిశీన

రాజోలు: అకాల వర్షాలకు ముంపునకు గురైన నారుమడులను ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ యూనివర్శిటీ రీసెర్చ్ డైరక్టర్ పీవీ సత్యనారాయణ మంగళవారం పరిశీలించారు. తాటిపాక, పొదలాడ, సోంపల్లి, కడలి గ్రామాల్లో పంటపొలాలను పరిశీలించి రైతులతో మాట్లాడారు. ఐదు రోజుల పాటు ముంపునీరు నారుమడుల్లో ఉంటే నష్టం ఉంటుందన్నారు. మార్టేరు ఏడీఏ టి.శ్రీనివాస్, ఏరువాక కోఆర్డినేటర్ నందకిషోర్ తదితరులు పాల్గొన్నారు.

పునరావాస కేంద్రం పరిశీలన



అప్పనరామునిలంకలో జెడ్పీ ఉన్నత పాఠశాలలో పునరావాస కేంద్రాన్ని పరిశీలించిన అధికారులు

సఖినేటిపల్లి: ధవళేశ్వరం బ్యారేజీ వద్ద మంగళవారం రెండో వరద ప్రమాద హెచ్చరిక జారీ చేసిన నేపథ్యంలో అప్పనరామునిలంక జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాన్ని అధికారుల బృందం పరిశీలించింది. ఈ మేరకు మండల ప్రత్యేకాధికారి సిద్దార్థ వర్ధన్, ఎంపీడీవో పీవీ సత్యనారాయణ, తహసీల్దారు సీహెచ్ పెద్దిరాజు, డీటీ సీహెచ్ భాస్కర్, ఏవో పీవీ నరసింహారావు, ఎస్సై ఎస్.రాము, సర్పంచ్ ఇందుకూరి సుబ్బరాజు పరిశీలించారు. వరద ఉధృతికి అనుగుణంగా బాధితులను కేంద్రానికి తరలించే విధంగా చర్యలు చేపడతామని వారు పేర్కొన్నారు. అలాగే టేకిశెట్టిపాలెం ఏటిగట్టు వద్ద వరద ఉధృతిని సర్పంచ్ పోతు దేవీదుర్గ, బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి మాలే శ్రీనివాస నగేష్, కటికిరెడ్డి మహేష్ పరిశీలించారు. ఏటిగట్టుకు చేరిన చెంచు సామాజిక వర్గం వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పంచాయతీ కార్యదర్శి కొండా సూరన్న, విస్సా తాతయ్య నాయుడు, వీఆర్వో దుర్గ, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

కేంద్ర బడ్జెట్‌లో ఏపీకి వరాల జల్లు

కొత్తపేట: 2047 వికసిత్ భారత్ లక్ష్యంగా ప్రధాన మంత్రి నరేంద్రమోదీ నాయకత్వంలో ప్రవేశపెట్టిన 13వ సార్వత్రిక బడ్జెట్‌లో కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి వరాల జల్లు కురిపించిందని రాష్ట్ర బీజేపీ కార్యవర్గ సభ్యుడు పాలూరి సత్యానందం పేర్కొన్నారు. ఈ బడ్జెట్‌లో ముఖ్యంగా రైతులు, యువత, మహిళలకు ప్రాధాన్యం, ఉద్యోగాలు, స్కిల్, ఎంఎస్ఎంఈ, అగ్రికల్చర్, అర్బన్ డెవలప్‌మెంట్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌పై పూర్తి దృష్టి పెట్టారని పేర్కొన్నారు. ఏపీ విభజన చట్టం అనుగుణంగా చర్యలు తీసుకుంటామని, అమరావతి నిర్మాణానికి రూ.15 వేల కోట్లు, పోలవరం ప్రాజెక్టు త్వరితగతిన పూర్తికి, రాయలసీమ, ప్రకాశం, ఉత్తరాంధ్ర జిల్లాలకు ప్రత్యేక నిధులు, విశాఖ-చెన్నై, కొప్పర్తి-హైదరాబాద్, బెంగళూరు-ఓర్వకల్లు కారిడార్ పారిశ్రామిక అభివృద్ధికి నిధులు కేటాయించిందని పేర్కొన్నారు.

కేంద్ర బడ్జెట్‌పై చీకురుమిల్లి హర్షం

అయినవిల్లి: కేంద్రం ప్రభుత్వం మంగళవారం ప్రవేశపెట్టిన వార్షిక బడ్జెట్ జనరంజకంగా ఉందని బీజేపీ పి.గన్నవరం అసెంబ్లీ కన్వీనర్ చీకురుమిల్లి వెంకటేశ్వరరావు అన్నారు, బుధవారం ఆయన మండలంలోని ఎస్.మూలపాలెంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కేంద్ర బడ్జెట్‌లో ఆంధ్రప్రదేశ్‌కి అగ్రపీఠం వేసి అమరావతికి పునర్నిర్మాణానికి రూ.15 వేల కోట్లు కేటాయించడ పై ఆయన హర్షం వ్యక్తం చేశారు. ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి ఎన్డీఏ ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆయన అన్నారు.

నేడు సంకటహర చతుర్థి పూజలు

అయినవిల్లి: అయినవిల్లిలో కొలువైన విఘ్నేశ్వర స్వామి ఆలయంలో బుధవారం సంకటహర చతుర్థి సందర్భంగా విశేష పూజలు నిర్వహిస్తున్న ఆలయ ఈఓ ముదునూరి సత్యనారాయణరాజు మంగళవారం ఓ ప్రకటన తెలిపారు. ఆయన మాట్లాడుతూ సంకటహర చతుర్థి సందర్భంగా స్వామివారి విశేష పూజల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొంటారన్నారు. స్వామికి చతుర్థి పూజలు విశేషంగా నిర్వహించడం వల్ల స్వామి శక్తి, మహిమలు మరింత పెరుగుతాయని నమ్మకమన్నారు. వేదపండితుల ఆధ్వర్యంలో ఈ పూజలు జరుగుతాయని తెలిపారు.

ఇసుక స్టాక్ పాయింట్ల వద్ద ప్రత్యేక నిఘా

రావులపాలెం/ఆత్రేయపురం: ప్రభుత్వం అందిస్తున్న ఉచిత ఇసుక విధానంలో అక్రమాలకు తావు లేకుండా ఇసుక పాయింట్లు వద్ద ప్రత్యేక నిఘా టీంలను ఏర్పాటు చేసినట్టు జిల్లా నూతన ఎస్పీ బి.కృష్ణారావు తెలిపారు. మంగళవారం రాత్రి ఆయన రావులపాలెం పోలీస్‌స్టేషన్‌ను సందర్శించారు. ఆయన మాట్లాడుతూ జిల్లాలో వివిధ ప్రాంతాల్లో స్టేషన్ వారీగా జరిగే కేసులు వాటి వివరాలు తెలుసుకునేందుకు ప్రతి స్టేషన్‌ను సందర్శిస్తున్నట్లు తెలిపారు. ఆయన వెంట కొత్తపేట డీఎస్పీ కేవీ రమణ, రావులపాలెం టౌన్ సీఐ జేమ్స్ రత్నంప్రసాద్ తదితరులు ఉన్నారు. అలాగే ఆత్రేయపురం పోలీస్ స్టేషన్‌ను ఎస్పీ బి.కృష్ణారావు మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు ఇచ్చారు.

కెనరా బ్యాంకు ఎండీ, సీఈవోని కలిసిన 'రుద్రరాజు'



బెంగళూరులో కెనరా బ్యాంకు ఎండీ సత్యనారాయణరాజును కలసిన గోపాలకృష్ణంరాజు

మలికిపురం: మండలంలోని లక్కవరానికి చెందిన పీసీసీ మెంబర్, స్థానిక కెనరా బ్యాంకు బ్రాంచి ఏర్పాటులో ఒకరైన రుద్రరాజు గోపాలకృష్ణంరాజు, బెంగళూరులో సదరు బ్యాంకు ఎండీ, సీఈవో కలిదిండి సత్యనారాయణరాజును మర్యాద పూర్వకంగా కలిశారు. వివరాలను మంగళవారం మీడియాకు ఆయన చెప్పారు. బ్రాంచిలో డ్వాక్రా మహిళలు తీసుకునే రుణాలకు లోన్ పుస్తకాలు ఇవ్వకపోవడం వల్ల వారు ఇబ్బందులు పడుతున్నారని ఎండీ దృష్టికి ఆయన తీసుకువెళ్లారు. తక్షణం ఈ సమస్య పరిష్కరించమని ఎండీ ఆదేశాలు జారీ చేశారు.

గాయపరచిన వ్యక్తులపై కేసు

ఆత్రేయపురం: మండలంలోని బొబ్బర్లంకలో గాయపర్చిన వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై శ్రీనివాస్ తెలిపారు. బొబ్బర్లంక గ్రామానికి చెందిన మిత్తిరెడ్డి వాసుకుమార్ బ్యారేజీ దగ్గర ఉండగా అదే గ్రామానికి చెందిన రమేష్, చంటి బీరు బాటిల్‌తో కొట్టి గాయపర్చారు. దీంతో వాసుకుమార్ రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. అక్కడ నుంచి అందిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

గంజాయి సేవిస్తూ పట్టుబడిన వ్యక్తులు

మలికిపురం: స్థానిక సత్యజ్యోతి థియేటర్ వద్ద మంగళవారం నలుగురు వ్యక్తులు గంజాయి సేవిస్తూ పట్టుబడినట్టు ఎస్సై సంపత్ కుమార్ తెలిపారు. ఈ మేరకు తమకు వచ్చిన సమాచారం ఆధారంగా చేసిన ఆకస్మిక దాడిలో వారు పట్టుబడ్డారన్నారు. వారి వద్ద నుంచి 400 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకున్నామన్నారు. కాగా వారిలో ఇద్దరు పాలకొల్లు వాసులు గాను, మరో ఇద్దరు మలికిపురం వాసులుగా గుర్తించినట్టు ఎస్సై తెలిపారు. ఈ దాడిలో తహసీల్దారు అనితకుమారి, వీఆర్వోలు అచ్యుత్, హరి పాల్గొన్నారు.